క్లుప్తంగా

అర్బన్ హెల్త్ నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: పట్టణంలోని 11వ వార్డు దేవాంగనగర్‌లో జరుగుతున్న అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణంకు గతంలో ప్రభుత్వం రూ.80 లక్షలు కేటాయించిందని, తాజాగా మరో రూ 38 లక్షలు ఆరోగ్య శాఖ ద్వారా మంజూరయ్యాయన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళ్లే దారికి సీసీ రోడ్డు, డ్రైన్లు 15వ ఆర్థిక సంఘ నిధుల్లో మంజూరు చేసినట్లు తెలిపారు.

సీపీఐ మహాసభలు జయప్రదం చేయాలి



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

హనుమంతునిపాడు: కనిగిరిలో ఈ నెల 31న జరిగే సీపీఐ నియోజకవర్గస్థాయి మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సభ్యుడు జీపీ రామారావు అన్నారు. మండలంలోని ముప్పళ్లపాడులో సీపీఐమహాసభ నిర్వహించారు. తొలుత జెండాను ఆవిష్కరించారు. సుబ్బు, సిద్ధయ్య, పెద్దబ్రహ్మయ్య, వీరాంజనేయులు, చెన్నకేశవులు, వెంకటయ్య, ధనలక్ష్మి, రాజ్యం పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



టోల్‌ప్లాజా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

టంగుటూరు: టోల్ ప్లాజా యాజమాన్యం తమ సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 16వ తేదీ నుంచి టోల్ ప్లాజాలో కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోసం ధర్నా చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు యాజమాన్యం బలవంతంగా టెంట్ తీసేసిందని, దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరించకపోగా కనీసం నిరసన చేసే హక్కు కూడా లేకుండా యాజమాన్యం చేస్తోందని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాము తీవ్రంగా ఖండించారు. టంగుటూరి రాము, కాశీ విశ్వనాథ్, డి.శృతి, కె.వసంతలక్ష్మి పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని హనుమంతాపురంలో బుధవారం సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామిని పట్టు వస్త్రాలతో అలకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణాన్ని తిలకించారు. సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి, వెంకటరమణమ్మల ఆధ్వర్యంలో అర్చకుల కల్యాణం జరిపించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గాయం బలరామిరెడ్డి, ఎంపీటీసీ తానిగుండాల తిరుపతరెడ్డి, కొండారెడ్డిపల్లి ఎంపీటీసీ రుద్రపాటి రాజు, విశ్రాంతి ఉపాధ్యాయుడు సానికొమ్ము ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా తిరునాళ్ల మహోత్సవం



విశిష్ట అలంకరణలో గంగాభవాని మూల విగ్రహమూర్తి, బొల్లావులు

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద గంగాభవాని వార్షిక తిరునాళ్ల వైభవంగా సాగుతోంది. గంగాభవానీ ఉత్సవమూర్తి అమ్మవారికి, బొల్లావులకు ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయంలో గంగామాత మూల విగ్రహమూర్తికి అభిషేకం, కుంకుమపూజ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్దారు. తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, సర్పంచ్ చప్పిడి వరలక్ష్మి, అజయ్ పాల్గొన్నారు.

ఒక్క రోడ్డు నిర్మిస్తే ఒట్టు



ఓవీ రోడ్డు నుంచి అధ్వానంగా పాత శింగరబొట్లపాలెం రోడ్డు



గత ప్రభుత్వంలో మంగపతివారిపాలెం వెళ్లే రోడ్డును తారు రోడ్డుగా మార్చేందుకు చేపట్టిన పనులు

- అధ్వానంగా గ్రామీణ ప్రాంతాల లింకు రోడ్లు
- గత ప్రభుత్వంలో రూ.14 కోట్లు మంజూరై పనులు ప్రారంభం
- ఎన్నికలు సమీపించడంతో నిలిచిన రోడ్ల నిర్మాణ పనులు
- కూటమి పాలనలో ఏడాదైన పట్టించుకోని పాలకులు
- మాటలు తప్ప చేతల ప్రభుత్వం కాదని ప్రజల ఆగ్రహం

పొన్నలూరు:

గ్రామాల అభివృద్ధే తమ ధ్యేయమని..2025 సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు, మట్టి రోడ్లు లేని గ్రామాలను నిర్మిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా నేటికీ ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మండల పరిధిలోని మంగపతివారిపాలెం, పాతశింగరబొట్లపాలెం, ఎదురువారిపాలెం, రామన్నపాలెం, తేటుపేట, జెడ్ మేకపాడు, శివన్నపాలెం, పాత శింగరబొట్లపాలెం, జెడ్ మేకపాడు, కల్లూరివారిపాలెం, చెంచుపాలెం, మూలేవారిపాలెం, ఓరుగంటివారిపాలెం గ్రామాలకు వెళ్లే రహదారులు కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ఎప్పుడో వేసిన రహదారులపైనే నేటికీ రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసిన స్థానిక మంత్రి స్వామి ఏడాది కావస్తున్నా రోడ్లు గురించి పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీటీ రోడ్లుగా ఉన్న ఈ రహదారులను తారు రోడ్లుగా మార్చడానికి సుమారుగా రూ.14 కోట్లు మంజూరు చేసి కొంత మేర పనులు చేపట్టారు. ఆ తర్వాత ఎన్నికల సమయం రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వంలో నిలిచిన పనులను ఏడాదిగా ప్రారంభించిన దాఖలాలు లేవు. దీంతో చేసేదేమి లేక ఇదే రోడ్లపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

వర్షం పడినప్పుడు నరకయాతన

మట్టి రోడ్లు ఉన్న గ్రామాల ప్రజలు వర్షం పడినప్పుడు రాకపోకలు సాగించాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు కూడా ముందుకు కదల్లేనంత చిత్తడిగా మారి గ్రామస్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పనుల కోసం ప్రజలు ఈ గ్రామాలకు వెళ్లడమంటే పెద్ద సాహసం అవుతుంది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఈ రోడ్లపై నడవాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మొత్తం బురదగా తయారై అడుగు తీసి అడుగు ముందుకు వేయలేనంత చిత్తడిగా ఈ రహదారులు మారుతున్నాయి.

మాటలు తప్ప ఆచరణ శూన్యం

వాస్తవంగా గత ప్రభుత్వంలో ప్రారంభమై కొంత మేరా జరిగిన రోడ్ల నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా అసలు పట్టించుకోలేదు. 2025 సంక్రాంతి పండగ నాటికి రాష్ట్రంలోని రోడ్లను అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రగల్భాలు పలకడంతో తమ గ్రామాలకు చెందిన రోడ్లు కూడా తారు రోడ్లుగా మారుతాయని ఆయా గ్రామాల ప్రజలు నమ్మకం పెట్టుకున్నారు. స్థానిక మంత్రితో పాటు కూటమి ప్రభుత్వం ఆ దిశగా పనులు చేపట్టక పోవడంతో మాటలు తప్పా ఆచరణ శూన్యమని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి నిలిచిన లింకు రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి రహదారి కష్టాలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో రూ.14 కోట్లు మంజూరు

ఇదిలా ఉంటే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2024లో మండలంలోని తొమ్మిది గ్రామీణ రహదారులను తారు రోడ్లుగా మార్చేందుకు ఏషియన్ బ్యాంక్ నిధులు సుమారుగా రూ.14 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధుల ద్వారా మంగపతివారిపాలెం, శివన్నపాలెం, ఎదురువారిపాలెం, జెడ్ మేకపాడు, కల్లూరివారిపాలెం, కోటపాడు, ఓరుగంటివారిపాలెం, తేటుపేట గ్రామాలకు చెందిన మట్టి రోడ్లకు హద్దులు ఏర్పాటు చేసి పనులు ప్రారంభించారు. పొక్లెయిన్‌తో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి గుంతలను పూడ్చి కంకర్ వేసి రోలింగ్‌తో చదును చేశారు. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల సమీపించడంతో తొమ్మిది రోడ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మట్టి రోడ్లుగా ఉన్న రహదారులను కొంతమేరా చదును చేసి కంకరతో చదును చేయడంతో రోడ్ల పరిస్థితి మెరుగుపడినా ఆయా గ్రామాల ప్రజలు ఈ రోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

తారు రోడ్లుగా విస్తరించాలి:



చాలా గ్రామాలకు సరైన రహదారులు లేక ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో రూ.14 కోట్లు మంజూరై కొన్ని రహదారులను తారు రోడ్లుగా నిర్మించేందుకు పనులు చేపట్టినా ఆ తర్వాత కూటమి ప్రభుత్వం కాలయాపన చేసింది తప్పా పనులు చేపట్టలేదు.

పల్లపోలు బాలకోటిరెడ్డి, మాజీ సర్పంచ్, పాతశింగరబొట్లపాలెం

అధికారులు చొరవ చూపాలి:



మా గ్రామానికి వెళ్లే రహదారి మట్టి రోడ్డు కావడంతో వర్షాలు పడినప్పుడు వాహనాలు తిరగక విద్యార్థులు, గ్రామస్తులు పలు అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి క్రమంలో గత ప్రభుత్వం రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి కంకర్‌తో రోడ్డు నిర్మించింది. నిలిచిన పనులను ఈ ప్రభుత్వం పట్టించు కోలేదు. లింకు రోడ్ల అభివృద్ధిపై ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

కప్పల దానియేలు, కలూరివారిపాలెం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చింతలచెరువు



కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యన్నారాయణ రెడ్డి బుధవారం కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసు అధికారులు



స్వాధీనం చేసుకున్న వాహనాలతో సీఐ, ఎస్సైలు



మల్లెతోటలో కార్డెన్ సెర్చ్‌లో సీఐ హజరత్తయ్య

కొండపి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారితో పాటు ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ సోమశేఖర్ హెచ్చరించారు. బుధవారం కొండపి టౌన్, కుమ్మరిపాలెం, గొడుగులపాలెంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ ఎటువంటి పత్రాలు లేని దాదాపు 100 ద్విచక్ర వాహనాలను, ఆటోను సీజ్ చేశామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ధృవపత్రాలతో పాటు హెల్మెట్ ధరించాలని, పరిమిత వేగంతో వాహనాన్ని నడపాలని, మద్యం తాగి వాహనాన్ని నడిపితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. పేకాట, అక్రమ మద్యం అమ్మకాలు, గంజాయి అమ్మకాల వివరాలు ఇస్తే వారి సమాచారం గోప్యంగా ఉంచి అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీజైన వాహనాలకు సంబంధించిన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లొచ్చని సూచించారు. దాదాపు 70 మంది సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్, ఏఆర్ ఆర్‌ఎస్సై పాపిరెడ్డి, ఏఎస్సై అంకారావు, హెడ్ కానిస్టేబుల్స్ కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రమేష్, కానిస్టేబుళ్లు సుధాకర్, అనిల్, రవి, సురేష్, శంకర్ పాల్గొన్నారు.

70 వాహనాలు స్వాధీనం

పామూరు: శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ ఎం భీమానాయక్ అన్నారు. పామూరులో సీఐ ఎం భీమానాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్టీ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు.వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు అందుబాటులో లేని 70 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. లాడ్జిల్లో తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తులను, నివాసాల్లో తనిఖీలు చేపట్టారు. స్థానిక సర్కిల్ కార్యాలయం ఆవరణలో రాత్రి సీఐ విలేకరులతో మాట్లాడుతూ తనిఖీల్లో ఒంగోలు, సింగరాయకొండ సీఐలతో పాటు సుమారు మొత్తం 200 మంది ఏఆర్ పోలీసులు, స్పెషల్ బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు. గంజాయి, మద్యం, మత్తు పదార్థాలు కలిగిఉన్నా, విక్రయించినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సైలు కిషోర్‌బాబు, ఆర్.సుమన్, కృష్ణపావని, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరాయకొండ: మండల కేంద్రంలోని మల్లెతోట, గాంధీనగర్, చంద్రబాబునాయుడు కాలనీల్లో బుధవారం సీఐ సీహెచ్ హజరత్తయ్య పర్యవేక్షణలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీల్లోని ప్రతి ఇంటిని స్పెషల్ పార్టీ, ఏఆర్ సిబ్బంది తనిఖీ చేశారు. ఆ తర్వాత మెయిన్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేశారు. తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 25 మోటారు సైకిళ్లు, 5 ఆటోలు, ఒక ట్రాక్టరును స్వాధీనం చేసుకుని విచారిస్తున్నట్లు సీఐ హజరత్తయ్య వివరించారు. అడిషనల్ ఎస్పీ ఏఆర్ అశోక్‌బాబు, ఎస్సై బి.మహేంద్ర, ఆర్ఐ రమణారెడ్డి, ఆర్ఎస్సై ప్రసాద్, 70 మంది స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నట్లు సీఐ వివరించారు.

తిరునాళ్ల పూజల్లో పాల్గొన్న దద్దాల



గంగాభవానీ ఆలయపూజల్లో పాల్గొన్న దద్దాల, నేతలు

పామూరు: మండలంలోని మోపాడు బంగ్లా వద్ద గంగాభవానీ తిరునాళ్లలో వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆయన్ను ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, ఎం కస్తూరిరెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి, ఓకేరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఎస్సీసెల్ నాయకులు కటికల వెంకటరత్నం, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఏడుకొండలు, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



ఓర్సు తిరుపతయ్య (ఫైల్)

మర్రిపూడి: మండల కేంద్రం మర్రిపూడికి చెందిన ఓర్సు తిరుపతయ్య మూడు రోజులుగా కనిపించడం లేదని కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు. ఇతడికి సుమారు 52 ఏళ్లు ఉంటాయి. ఈ నెల 20వ తేదీన మర్రిపూడి నుంచి పొదిలికి ఆటోలో బయల్దేరి వెళ్లాడు. తిరుగు సమాధానం చెప్పలేదు. వివరాలు తెలిస్తే 80083 88294, 94408 18222, 86398 74077 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరారు.

సేకరించిన చెత్తకు నిప్పు



సేకరించిన చెత్తకు పెట్టిన నిప్పు

టంగుటూరు: స్థానిక పంచాయతీ సిబ్బంది చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించి సంపద సృష్టించాలని ప్రభుత్వం పంచాయతీల్లో రూ.3 నుంచి రూ.5 లక్షలు వెచించి సంపద తయారీ కేంద్రాలను నిర్మిస్తే పంచాయతీ సిబ్బంది మాత్రం చెత్తను సేకరించి టంగుటూరు గ్రామ శివారు జాతీయ రహదారి సమీపంలోని రోడ్డు పక్కనే పడేస్తున్నారు. ఆ చెత్తకు నిప్పు పెడుతున్నారు. దీంతో అటువైపు వెళ్లే వాహదారులు దట్టమైన పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది నిర్వాకంతో ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యం నీరుగారుతోంది. ఈ తంతు తెలిసినా.. రోజూ చూస్తున్నా మండల అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు.

రూ.5 కోట్లతో ఆక్వా హబ్‌గా పాకల బీచ్

సింగరాయకొండ: ఐదు కోట్ల రూపాయల ఎస్ఆర్ఎల్ఎం నిధులతో పాకల బీచ్‌ను ఆక్వా హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. మండలంలోని పాకల బీచ్‌ను ఆక్వా హబ్‌గా అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను బుధవారం ఆయన స్వయంగా పరిశీలించారు. బీచ్‌లో సుమారు రూ.3 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీచ్‌ను పర్యాటక రంగంగా అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల వసతులు ఉన్నాయన్నారు. బీచ్‌ను సెర్ప్ డైరెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ నారాయణతో కలిసి సత్య పరిశీలించారు.

డెయిరీ యూనిట్‌కు రూ.ఐదు కోట్లు

కొండపి: నియోజకవర్గ కేంద్రం కొండపిలో వ్యవసాయ ప్రధాన అనుబంధ డెయిరీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు సెర్ప్–డీఆర్డీఏ వెలుగు శాఖ ద్వారా రూ.ఐదు కోట్లు నిధులు మంజూరైనట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటోరియం బోర్డు డైరెక్టర్ సత్య అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవన సమావేశం హాలులో ఏపీఎం బల్లికూర గోపీనాథ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. డీఆర్డీఏ పీడీ నారాయణ, ఎంపీడీఓ రామాంజనేయులు, తహసీల్దార్ పి.మురళి, ఏఎంసీ మాజీ చైర్మన్ రామయ్య పాల్గొన్నారు.

పిల్లలతో ఉపాధి పనులు చేయిస్తే చర్యలు




కూలీల మస్టర్‌ను తనిఖీచేస్తున్న ఏపీఓ

సీఎస్‌పురం(పామూరు): బడిఈడు పిల్లలతో ఉపాధి పనులు చేయిస్తే చర్యలు తీసుకుంటామని ఏపీఓ వల్లెపు శ్రీనివాసనాయక్ అన్నారు. మండలంలో ఉపాధి పనులు జరుగుతున్న కోవిలంపాడు, శీలంవారిపల్లె, గోగులపల్లె, మిట్టపాలెం గ్రామాల్లో బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీచేశారు. ఈసందర్భంగా ఏపీఓ నాయక్ కూలీల మస్టర్‌లను తనిఖీచేశారు. కూలీలు పనివేళలు పాటించి అత్యధిక వేతనం పొందాలే తప్ప పని చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూడవద్దన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలు ఇతరుల పేర్లతో పనికిరావద్దని, ఇది నేరమన్నారు. రజ్జబ్‌బాషా, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని ఎంపీడీఓ కె.వాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఉపాధి సిబ్బందితో ఏపీఓ వి.శ్రీనివాస నాయక్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. కూలీల వద్ద నగదు వసూళ్లకు పాల్పడితే వారిని ఉపేక్షించేది లేదన్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు

కొండపి: మండలంలో రెండు రోజుల నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. బుధవారం మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో మండల కేంద్రం కొండపిలో 5 నిమిషాల పాటు కొద్దిపాటి వర్షం కురిసింది. ఆ వర్షానికి ప్రభుత్వ శాఖల సముదాయానికి వెళ్లే సిమెంట్ రోడ్డు చెరువును తలపించింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి డీఆర్డీఏ–వెలుగు కార్యాలయం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం, మండల విద్యాశాఖ కార్యాలయం, మండల అభివృద్ధి కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం అధికారులు వెళ్తుంటారు. కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై నీరు చేరి ఆ రోడ్డు చెరువును తలపించింది. ఆయా కార్యాలయాలకు వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



చెరువును తలపిస్తున్న రోడ్డు

పతనమవుతున్న పొగాకు గరిష్ట ధరలు



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్



టంగుటూరులో..

- పది రోజుల వ్యవధిలోనే తగ్గిన రూ.10

టంగుటూరు: రోజురోజుకు పతనమవుతున్న పొగాకు గరిష్ట ధరలను చూసి రైతులు పెట్టుబడులు కూడా రావని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల వ్యవధిలోనే పొగాకు బోర్డు అధికారులు రూ.10 తగ్గించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం పొందూరు, ఆలకూరపాడు, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం, అనంతవరం గ్రామానికి చెందిన రైతులు 568 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 463 కొనుగోలు చేశారు. 105 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280కాగా, కనిష్ట ధర రూ.205 పలకగా సరాసరి రూ.236.95 ధర పలికింది. వేలంలో మొత్తం 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

నాణ్యమైన బేళ్లకే అధిక ధర

కొండపి: నాణ్యమైన పొగాకు బేళ్లకే అధిక ధర లభిస్తుందని స్థానిక వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం వేలం సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేళ్లలో అన్య పదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొగాకును అనధికారికంగా అమ్మకాలు చేపట్టరాదన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో క్లస్టర్ పరిధిలోని అక్కచెరువుపాలెం, పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు 635 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 562 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 73 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ. 280, కనిష్ట ధర కేజీ రూ.200, సరాసరి ధర కేజీ రూ.264.31గా నమోదైంది. వేలంలో 20 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. బుధవారం నిర్వహించిన వేలాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పరిశీలించారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

కనిగిరిరూరల్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామన వెంకటేశ్వరరెడ్డి అన్నారు. వచ్చే నెల 5వ తేదీ విజయవాడలో జరిగే సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక వైష్ణవీ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు బకాయిలు, వేతన సవరణ, భవిష్యత్ ప్రణాళికా తదితర అంశాలపై చర్చించారు. ఏపిజీఈఏ కనిగిరి తాలూకా యూనిట్ నాయకులు రమేష్ బాబు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, ఎస్‌కే మస్తాన్‌వలి, పి.మల్లికార్జున పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

హనుమంతునిపాడు: వీఆర్వోల సమస్యలు పరిష్కారంతో పాటు పనిభారం తగ్గించాలని కోరుతూ బుధవారం సాయంత్రం తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు వీఆర్వోలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ .కాశయ్య, పి.బెంజిమెన్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం తీసకొచ్చిన జీవో నంబర్ 4ను రద్దు చేయాన్నారు. రెండు సచివాలయాలకు ఒకే వీఆర్‌ఓతో పనిచేభారం ఎక్కువవుతుందని, ఎక్కడ పనిచేసే వీఆర్‌ఓలను అక్కడే ఉంచాలని, సమస్యలను పరిష్కరంచాలని వినతిపత్రం అందజేశారు. వీఆర్వోలు కాశయ్య, రసూల్, బెంజిమేన్, బాదుర్ల, పరుసురామ్, జేమ్స్, ఝాన్సీ, షబ్బీర్, గురుస్వామి, చిన్నయ్య, నాసరివలీ పాల్గొన్నారు.